


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 29-06-2022 సంపుటి : 03 సంచిక : 275 పేజీలు : 4 వెల : రూ 3-00


## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణస్వీకారం



హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంగళవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ఉజ్జల్ భూయాన్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరై, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సతీశ్‌చంద్రశర్మ ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని కొలీజియం మే 17న చేసిన సిఫారసును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇటీవల ఆమోదించగా గతవారం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. అసోంకు చెందిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్ 2011 అక్టోబర్ 17న గువాహటి హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013లో పూర్తిస్థాయి న్యాయమూర్తి అయ్యారు. 2019 అక్టోబర్ 3న బాంబే హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2021 అక్టోబర్ 22న తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. ఆయన తండ్రి సుచేంద్రనాథ్ భూయాన్ సీనియర్ న్యాయవాది. అసోం అడ్వొకేట్ జనరల్‌గా కూడా పనిచేశారు. జస్టిస్ ఉజ్జల్ భూయాన్



1964 ఆగస్టు 2న గువాహటీలో జన్మించారు. అక్కడి డాన్ బాస్కో ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్య, కాటన్ కాలేజీలో ఇంటర్, ఢిల్లీలోని కిరోరి మాల్ కాలేజీలో డిగ్రీ చేశారు. గువాహటి ప్రభుత్వ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బి, గువాహటి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎం చేశారు. 1991 మే 20న అసోం న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు.

# విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ..



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విద్యాశాఖలో నాడు-నేడు, డిటిజల్ లెర్నింగ్‌పై సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో బైజూస్‌తో ఒప్పందం దృష్ట్యా విద్యార్థులకు సంబంధిత కంటెంట్ అందించడంపై సీఎం జగన్ చర్చించారు. అలాగే సెప్టెంబరులో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడంపై సమీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తరగతి గదుల్లో డిజిటల్ స్క్రీన్ల ఏర్పాటుపై కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు.. సెప్టెంబరులో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ ఇస్తామని, ఆ ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్‌ను లోడ్ చేయాలని తెలిపారు. దీనికి తగినట్టుగా ట్యాబ్ స్పెసిఫికేషన్స్, ఫీచర్లు ఉండాలన్నారు ఇవి నిర్ధారించాక ట్యాబ్‌ల కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టాలని పేర్కొన్నారు.. టెండర్లు పిలిచేటప్పుడు నాణ్యత, డ్యూరబులిటీని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. 8వ తరగతిలో ఇచ్చే ట్యాబ్ సంబంధిత విద్యార్థి తర్వాత చదివే తరగతులకు కూడా అంటే 9, 10 తరగతుల్లో కూడా పనిచేయాలని తెలిపారు. అందుకే నిర్వహణ కూడా అత్యంత ముఖ్యమని, ఏదైనా సమస్య వస్తే వెంటనే దాన్ని రిపేరు చేసే అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత సమయంలోగా ట్యాబ్‌లు పిల్లలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచి కంపెనీలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..అలాగే తరగతి గదిలో డిజిటల్ బోర్డులు, టీవీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. దీనికి సంబంధించి కార్యాచరణ కూడా రూపొందించండి:విద్యా నిపుణుల సలహా మేరకు కొన్ని తరగతుల్లో

### సీఎం జగన్ కీలక ఆదేశాలు
### విద్యాశాఖలో నాడు-నేడుపై సీఎం జగన్ సమీక్ష

ఇంటరాక్టివ్, మరికొన్ని తరగతులకు టీవీ స్క్రీన్లు పెట్టేందుకు ప్రతిపాదిస్తున్నామన్న అధికారులు.ప్రతి తరగతి గదిలోనూ ఇవి ఉండేలా చూడాలని సీఎం ఆదేశంతరగతి గదిలో డిజిటల్ స్క్రీన్, బ్లాక్ బోర్డులు.. వీటి అమరిక ఎలా ఉండాలన్న దానిపై కూడా ఆలోచన చేయాలన్న సీఎంబోధనకు ఎప్పుడు, దేన్ని ఉపయోగించుకున్నా.. అందుకు అనుగుణంగా వీటి అమరిక ఉండాలన్న సీఎంఇప్పటికే డిజిటల్ స్క్రీన్లు, బోర్డులు వినియోగిస్తున్న తీరును పరిశీలించాలన్న సీఎంవీటి వల్ల సైన్స్, మాథ్స్ లాంటి సబ్జెక్టులు పిల్లలకు మరింత సులభంగా చక్కగా అర్థం అవుతాయన్న సీఎంవీటి వల్ల టీచర్ల బోధనా సామర్థ్యం కూడా పెరుగుతుందిస్క్రీన్ మీద కంటెంట్‌ను హైలెట్ చేసుకునేలా, ఎనలార్జ్ చేసుకునేలా ఏర్పాటు ఉంటే బాగుంటుంది.దీనికి సంబంధించి కూడా ప్రతిపాదనలు తయారుచేయాలిఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సమీర్ శర్మ, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, సర్వ శిక్షా అభయాన్ ఎస్‌పీడీ వెట్రిసెల్వి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కొడాలి ఒక బ్రాండ్.. దెబ్బకు బాబుకు నిద్ర పట్టడం లేదు

### గుడివాడ ప్లీనరీలో పేర్ని నాని

కృష్ణా జిల్లా: కొడాలి నానిని టీడీపీ అధినేత చంద్రబాబు ఇంకా 2004కు ముందు మనిషే అనుకుంటున్నాడని, కానీ, నాని ఇప్పుడు వేలాది మంది అభిమానం సొంతం చేసుకున్న వ్యక్తి అని.. మాజీ మంత్రి, కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పేర్నినాని పేర్కొన్నారు. మంగళవారం కృష్ణా జిల్లా గుడివాడ వైఎస్సార్‌సీపీ ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న పేర్నినాని.. "కొడాలి నాని దెబ్బకు చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదు. నేను సీఎంని అవుతా.. సీఎం జగన్‌ను దించేస్తా అనే స్థాయి నుంచి.. ఇవాళ నానిని ఓడిస్తా అనే స్థాయికి చంద్రబాబు దిగజారిపోయాడు. కానీ, ఇప్పుడు గుడివాడకు కొడాలి నాని ఒక బ్రాండ్ అంబాసిడర్. కొడాలి నానిని ఓడించడం తర్వాత సంగతి.. ముందు పోటీకి ఎవరైనా అభ్యర్థి ఉన్నాడేమో చూస్కోండి. కొడాలి నానికి భయపడి ఏదో ఒకటి మాట్లాడుతున్నారు. బాబే కాదు.. ఎంత మంది దిగొచ్చినా కొడాలిని ఏం చేయలేరు. పేదలకు ఇచ్చిన ఇంటిని నారా లోకేష్ బాత్‌రూమ్‌తో పోలుస్తున్నాడు. అక్రమ సంపాదనతో పెద్ద బాత్రూం కట్టించుకున్నావ్ కాబట్టే అలా మాట్లాడుతున్నావ్. పేదల సొంతింటి కల నెరవేర్చిన.. గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని పేర్ని నాని ప్రసంగించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. గుడివాడ గడ్డ కొడాలి నాని అడ్డా అని, దీన్ని ఎవరూ చెక్కు చెదర్చలేరని పేర్కొన్నారు. కార్యకర్తల కష్టం, పోరాట ఫలితంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిందని.. మరో పాతికేళ్ల పాటు సీఎంగా ఉంటారని చెప్పారాయన. చంద్రబాబు తన దుష్ట చతుష్టయంతో కలిసి వచ్చినా.. కొడాలి నానిని ఓడించలేరని పేర్కొన్నారు.



## మేనిఫెస్టోను పవిత్ర గ్రంధంలా భావించిన ఘనత సీఎం జగన్‌దే: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం: మేనిఫెస్టోను పవిత్ర గ్రంధంలా భావించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు అనంతపురంలో పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అన్నిటిని నెరవేర్చేందుకు

సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారు.కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, 600 హామీలు ఇచ్చి.. మేనిఫెస్టోను కూడా వెబ్‌సైట్ నుంచి తొలగించారు. 30 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌ది. ఆత్మకూరు ఉపఎన్నికలో వైఎస్సార్‌సీపీ 82888 ఓట్ల మెజార్టీ రావడం శుభపరిణామం అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.

## దత్త పుత్రుడిని, సొంత పుత్రుడిని తుక్కుతుక్కుగా ఓడించాం

కృష్ణా జిల్లా: పనికిమాలిన 420లు అంతా అమ్మఒడి పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్స్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ స్కూల్స్‌ను తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలల అభివృద్ధికి మూడేళ్లలోనే రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిన సీఎం దేశంలో ఎవరైనా ఉన్నారా? అంటూ కొడాలి నాని ప్రశ్నించారు. మంగళవారం కృష్ణా జిల్లా గుడివాడలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్లీనరీ




సమావేశంలో కొడాలి నాని మాట్లాడుతూ.. స్కూల్స్ మెయింటెనెన్స్, టాయిలెట్స్ నిర్వహణకోసం రూ.2 వేలు తీసుకుంటున్నాం. 75% హాజరు ఉన్న ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి అందించాం. చంద్రబాబుకి సిగ్గూ శరం లేదు. చంద్రబాబు నీ జీవితంలో రూ.18 లక్షలైనా ఖర్చు చేశావా. రామోజీరావు, బీఆర్ నాయుడు, దత్తపుత్రుడికి కళ్లు కనిపించడం లేదా?. చంద్రబాబు 14 ఏళ్లలో ఏడాదికి ఒకటి మెడికల్ కాలేజీ చొప్పున కట్టినా జిల్లాకొకటి ఉండేది. జగన్ సీఎం అయిన తర్వాత 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూ.20 వేల కోట్లు పిల్లలకు ఖర్చు చేస్తుంటే.. దీన్నే మంటారు మీ పిండాకూడా అంటూ మాజీ మంత్రి కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మంచి చేస్తుంటే ఈ 420లు అంతా కలిసి వెనుక గోతులు తవ్వుతున్నారు. సామాజిక న్యాయం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానం కల్పించారు. తెలుగుదేశం అధికారంలో ఉంటే బీసీలకు జడ్పీ చైర్ పర్సన్ వచ్చుండేదా. టీడీపీ ఏనాడూ సీఎం జగన్ ప్రభుత్వం మాదిరి సంక్షేమాన్ని అందించలేదు అని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు.

## దేశంలో కరోనా ఉధృతి..

### 96వేలు దాటిన యాక్టివ్ కేసులు

దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. గడిచిన 24 గంటల్లో 11,793 కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. కొత్తగా వైరస్ కారణంగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, నిన్నటితో పోలిస్తే తాజా కేసులు కాస్త తగ్గుముఖం పట్టగా.. 24 గంటల్లో 9,486 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. కొత్త కేసులతో కలిసి దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 4,34,18,839కు పెరిగింది. 4,27,87,092 మంది కోలుకున్నారు.వైరస్‌తో 5,25,047 మంది బాధితులు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 96,700 యాక్టివ్ కేసులున్నాయని ఆరోగ్యశాఖ తెలిపింది. దేశంలో ప్రస్తుతం రికవరీ రేటు 98.57శాతంగా ఉందని, మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.21శాతం ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం దేశవ్యాప్తంగా 4,73,717 కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఎఐసీఎంఆర్) తెలిపింది. ఇప్పటి వరకు 86,14,89,40 నమూనాలను పరిశీలించినట్లు చెప్పింది. టీకా డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 1,97,31,43,196 డోసులు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ వివరించింది.



## ఉక్రెయిన్‌లో మాల్‌పై క్షిపణి దాడి..

### 16 మంది మృత్యువాత

కీవ్ : ఉక్రెయిన్‌లోని సెంట్రల్ సిటీ క్రెమెన్‌చుక్‌లోని ఓ షాపింగ్ మాల్‌పై రష్యా క్షిపణి దాడి జరిపింది. రద్దీగా ఉండే మాల్‌పై దాడి జరుపడంతో 16 మంది మృత్యువాతపడ్డారు. మరో 59 మంది గాయపడ్డట్లు ఉక్రెయిన్ అత్యవసర సేవల అధిపతి సెర్గి క్రుక్ మంగళవారం వేకువ జామున ప్రకటించారు. షాపింగ్ మాల్‌పై మిస్సైల్ దాడి అనంతరం రెస్క్యూ పనులు, శిథిలాల తొలగింపు, మంటలను ఆర్పివేసే ప్రధాన పనులు కొనసాగుతున్నాయన్నారు. మిస్సైల్ దాడి సమయంలో మాల్‌లో వెయ్యి మందికిపైగా పౌరులు ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ పేర్కొన్నారు. మంటలతో ఫైటర్లు పోరాడుతున్నారని, బాధితుల సంఖ్యను ఊహించలేమని జెలెన్‌స్కీ ఫేస్‌బుక్‌లో పేర్కొన్న ఆయన.. ఓ వీడియోను పోస్ట్ చేశారు. అయితే,



రష్యా క్షిపణి దాడిని నగర మేయర్ విటాలి మాలెట్‌స్కీ ఖండించారు. పౌర జనాభాపై విరక్తికరమైన తీవ్రవాద అచర్య అని పేర్కొన్నారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి డిమిట్రో కులేబా మరిన్ని భారీ ఆయుధాలను సరఫరా చేయాలని, రష్యాపై ఆంక్షలు విధించాలని మిత్ర దేశాలకు పిలుపునిచ్చారు. రష్యా మానవాళికి అవమానకరం, అది పర్యావసరాలను ఎదుర్కొవాలన్నారు.

## తిరుపతి కోర్టుకు నటులు మోహన్‌బాబు, విష్ణు, మనోజ్

తిరుపతి: నటుడు మంచు మోహన్‌బాబు మంగళవారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు కుమారులు మంచు విష్ణు, మంచు మనోజ్ కూడా కోర్టుకు వచ్చారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో 2019లో అప్పటి ప్రభుత్వం మోహన్‌బాబుపై కేసు నమోదు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో 2019లో మదనపల్లి హైవేపై మోహన్‌బాబు ఫ్యామిలీ ఆందోళన చేసింది. దీంతో ఆరోజు కేసు నమోదు చేశారు. ఇదే కేసులో ఇవాళ కోర్టుకు హాజరయ్యారు. అయితే న్యాయస్థానం ఈ కేసు విచారణను సెప్టెంబర్ 20కు వాయిదా వేసింది.

# సంపాదకీయం

బుధవారం 29-06-2022

## పిల్లల భవిష్యత్తు పై నీలినీడలు

ఒక కొత్త నివేదిక ప్రకారం, విద్యా సహాయం అవసరమయ్యే సంక్షోభ ప్రభావిత దేశాలలో పాఠశాల వయస్సు పిల్లల సంఖ్య 2016 లో 75 మిలియన్ల మంది వుండగా, ప్రస్తుతం 222 మిలియన్లకు పెరిగిందని ఐక్యరాజ్యసమితి జూన్ 21, 2022న ప్రచురించిన నివేదిక పేర్కొన్నది. వారిలో, 78.2 మిలియన్లు తరచుగా దీర్ఘకాలిక సంఘర్షణలు, అత్యవసర పరిస్థితుల కారణంగా పాఠశాలకు దూరంగా ఉన్నారు. సంక్షోభం బాధిత పిల్లల సంఖ్య, విద్య అవసరం ఉన్న కౌమారదశలోని వారు అనే విశ్లేషణ ప్రకారం, బడి బయట ఉన్న పిల్లలలో 54 శాతం మంది బాలికలు, 17 శాతం మంది క్రియాత్మక ఇబ్బందులతో బాధపడుతున్న పిల్లలు,16 శాతం మంది బలవంతంగా వేరే ప్రాంతాలకు తరలించబడినవారూ వున్నారు.అత్యవసర పరిస్థితులు, దీర్ఘకాలిక సంక్షోభాలలో విద్య కోసం ఐక్య రాజ్య సమితి ప్రపంచ నిధి, సాయుధ పోరాటాలు, బలవంతంగా వేరే ప్రాంతాలకు తరలింపులు, వాతావరణ ప్రేరిత విపత్తులు, దీర్ఘకాలిక సంక్షో భాల కారణంగా నాణ్యమైన విద్యను కోల్పోతున్న బాలికలు, అబ్బాయిల సంఖ్యను ఎడ్యుకేషన్ కెనాట్ వెయిట్ (ఇసిడబ్ల్యు) ప్రధానంగా పేర్కొన్న అంశాలు ఎంతో ఆందోళనకరంగా ఉంది. సంక్షోభ పీడిత ప్రాం తాల్లో నివసిస్తున్న దాదాపు 119.6 మిలియన్ల మంది పిల్లలు పాఠశాలకు హాజరయ్యారు కానీ గణితం లో లేదా పఠనంలో కనీస నైపుణ్యాన్ని సాధించలేకపోయారని కనుగొన్నారు. మరో 24.2 మిలియన్లు ప్రీ-ప్రైమ రీ, ప్రైమరీ లేదా సెకండరీ స్కూల్‌లో గణితం లేదా పఠనంలో కనీస నైపుణ్యాన్ని సాధిస్తున్నారు, అయితే ఇప్పటికీ సంక్షోభాల వల్ల ప్రభావితమయ్యారు. వీరికి మద్దతు అవసరం అని స్పష్టం చేసింది. 84 శాతం మంది పూర్తిగా బడి బయట ఉన్న పిల్లలు లేదా 65.7 మిలి యన్లు దీర్ఘకాలిక సంక్షోభాలు ఉన్న ప్రాంతాల్లో నివసిస్తు న్నారని నివేదిక పేర్కొంది. ఈ 65.7 మిలియన్లలో మూడింట రెండొంతుల మంది ఆఫ్ఘనిస్తాన్, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా, మాలి, నైజీరియా, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్, పాకిస్తాన్, యెమెన్‌లలో నివసిస్తున్నారు. సబ్-సహారా ఆఫ్రికాలోని పిల్లలు చదువునేర్వలేని స్థితితో తీవ్రంగా దెబ్బతిన్నారని లాభాపేక్షలేని సేవ్ ది చిల్డ్రన్ చేసిన మరొక నివేదిక తెలియజేసింది. శరణార్థుల కోసం ఏర్పాటైన యు.ఎన్ హై కమిషనర్ ఇటీవలి నివేదిక ప్రకారం 2019-2020లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శరణార్థుల కోసం సెకండరీ స్థాయి విద్య లో స్థూల నమోదు 34 శాతంగా ఉంది. మహమ్మారికి ముందు, సంక్షోభ ప్రభావిత పిల్లలలో 9 శాతం మంది మాత్రమే గణితంలో కనీస నైపుణ్యాన్ని సాధించారు. సంక్షోభం-ప్రభావిత పిల్లలలో 15 శాతం మంది మాత్రమే ప్రారంభ తరగతుల్లో చదవడంలో కనీస నైపుణ్యాన్ని సాధించారని విశ్లేషణలో తేలింది. కోవిడ్- 19 మహమ్మారి, ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా పాఠశాలలు సుదీర్ఘకాలం మూసివేయడం వల్ల ప్రపంచ సంక్షోభం తీవ్ర మైందని నిపుణులు చెప్పారు. సంక్షోభ తీవ్రత, క్రియాత్మక ఇబ్బందులతో ఉన్న పిల్లలు, వేరే ప్రాంతాలకు తరలించబడిన కుటుంబాల పిల్లలు, బడి బయట వున్నవారి శాతం సంబంధించి అందుబాటులో ఉన్న డేటాను ప్రభావితం చేసే కొత్త పద్ధతిని తాజా అధ్యయనం ప్రతి పాదించింది.యూనిసెఫ్ బహుళ సూచిక క్లస్టర్ సర్వేలు, అంతర్జాతీయ గణితం, సైన్స్ అధ్యయన డేటా బేస్‌లో అభి వృద్ధి కోసం అంతర్జాతీయ విద్యార్థి అంచనా వివరాలు కూడా అత్యవసర పరిస్థితుల్లో బడి బయట ఉన్న పిల్లల సంఖ్యను, అలాగే నేర్చుకోని వారి సంఖ్యను అంచనా వేయడానికి ఉపయోగించాలి. అందువల్ల తక్షణ విద్యా మద్దతు అవసరమని రచయి తలు సూచించారు. ఈ పద్ధతి యొక్క పరిమితి ఏమిటంటే ఇది ప్రధానంగా సంక్షోభం-ప్రభావిత వ్యక్తులుగా పరిగణించబడే వ్యక్తుల నిష్పత్తిని సరిగ్గా అంచనా వేయ దంపై ఆధారపడి ఉంటుంది. అనేక పెద్ద సంక్షోభ-ప్రభావిత దేశాలలో, మూడు నుంచి నాలుగు సంవత్స రాల వయస్సు గల పిల్లలకు, ప్రాథమిక పాఠశాలకు ముందు సంవత్స రంలో ఉన్నవారికి పాఠశాల వెలు పల రేట్ల డేటా అందుబాటులో లేదని నివేదిక పేర్కొంది.

# ధర్మాన సోదరుల మధ్య ఫైట్



శ్రీకాకుళం, జూన్ 28, ధర్మాన కృష్ణదాస్.. ధర్మాన ప్రసాదరావు. ఇద్దరూ సోదరులే. కృష్ణదాస్ డిప్యూటీ సీఎంగా చేస్తే.. మొన్నటి కేబినెట్ పునర్ వ్యవస్థీకరణలో అన్నను సాగనంపి.. తమ్ముడు ప్రసాదరావును మంత్రిని చేశారు. కృష్ణదాస్‌కు పార్టీ పగ్గాలు అప్పగించారు. కృష్ణదాస్ మంత్రిగా ఉండగా ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రసాదరావు.. నేడు అన్న కృష్ణదాస్ పార్టీ అధ్యక్షుడిగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తమ్ముడు డుమ్మా కొట్టేస్తున్నారు. మంత్రి పదవిలో ఉండగా దాసన్న చుట్టూ ప్రదర్శన చేసింది కేడర్. ప్రసాదరావు మంత్రి కావడంతో ఆ కేడర్ ఇటు టర్న్ తీసుకుంది. అంతేనా.. కృష్ణదాస్ ఎమ్మెల్యేగా ఉన్న నరసన్నపేట వైసీపీ నేతలు సైతం పనులకోసం ధర్మాన ప్రసాదరావును ఆశ్రయిస్తున్నారు. ఇది అన్నకు అస్సలు రుచించని అంశం. ఆ ఆవేదన నరసన్నపేట వైసీపీ ప్లీనరీలో కృష్ణదాస్ మాటల్లో తన్నుకొచ్చింది.హద్దు మీరితే అధినేత సీఎం జగన్‌కు కంప్లయింట్ చేస్తానన్నది కృష్ణదాస్ వార్నింగ్. దాంతో అన్నదమ్ముల మధ్య ఆధిపత్యపోరు పీక్స్‌కు చేరుకుందనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం కృష్ణదాస్ కామెంట్స్ చుట్టూనే చర్చ జరుగుతోంది. చిన్నా చితక నేతలపై అధినేతకు ఫిర్యాదు చేయాల్సిన పనిలేదని.. ఆయన అనడంతో.. తమ్ముడు ప్రసాదరావునే కృష్ణదాస్ గురి పెట్టినట్టు అర్థం అవుతోంది. వచ్చే ఎన్నికలలోపు బ్రదర్స్ మధ్య రాజుకున్న ఈ అగ్గి బడబాగ్నిగా మారే ప్రమాదం ఉందని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయట.నరసన్నపేటలో చాలా మంది వైసీపీ నేతలు.. ప్రసాదరావుకు తెలుసు. మొన్న మంత్రి అయిన తర్వాత ఆ పాత పరిచయాలు మరింత యాక్టివ్ అయ్యాయి. అయితే కృష్ణదాస్‌కు తెలియకుండా పనులు చక్కబెట్టడమే సమస్యకు కారణమన్నది పార్టీ వర్గాల మాట. దీంతో వర్గ రాజకీయం బుసలు కొడుతోంది. అది పార్టీ చేపట్టే కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపెడుతోంది. ఆ మధ్య నిర్వహించిన సామాజిక న్యాయభేరి బస్సు యాత్రలో నేతల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇచ్ఛాపురం, టెక్కలి లో గ్రూపు రాజకీయాలను సెట్ చేసేందుకు అన్నదమ్ములు కలిసి కృషి చేసినా తర్వాత బ్రదర్స్ మధ్యే గ్రూపు ఫైట్ మరో అంకానికి చేరుకుంది. సమస్య శ్రుతి మించుతోంది అన్నప్పుడల్లా మంత్రి బొత్స సత్యనారాయణ ఎంట్రీ ఇవ్వక తప్పడం లేదట. దీంతో బొత్స పాల్గొనే సభలకు ధర్మాన ప్రసాదరావు డుమ్మా కొట్టేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన పార్టీలు ఎన్నికల మూడ్‌లోకి వెళ్లే పనిలో ఉన్నాయి. వ్యూహాలకు పదును పెడుతున్నాయి. శ్రీకాకుళంలో మాత్రం అన్నదమ్ముల మధ్యే ఎన్నికల రణతంత్రం పదునెక్కుతోంది. అది అధికారపార్టీ శ్రేణులకు మింగుడు పడని పరిస్థితి. సమస్య ముదిరి వార్నింగ్‌లు ఇచ్చుకునే వరకు వెళ్లడంతో రేపటి రోజున ఇంకేం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. మరి.. ధర్మాన సోదరుల పంచాయితీకి ముగింపు పలకడానికి వైసీపీలో ఎవరు చొరవ తీసుకుంటారో చూడాలి.

# హెల్త్ ఎమర్జెన్సీని తలపిస్తున్న డాక్టర్లు

అనంతపురం, జూన్ 28, ఎమర్జెన్సీ కేసులు పెద్దాసుపత్రులను గుక్కతిప్పుకో నివ్వడం లేదు. ఏ ఆస్పత్రిలో చూసినా ఎమర్జెన్సీ వార్డులు కిటకిటలాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కేసులు నమోదు కావడం వైద్య వర్గాలనే విస్మయపరుస్తోంది. నెల తిరిగే సరికి ఒక్కో ఆస్పత్రిలో వేలల్లో ఎమర్జెన్సీ కేసులు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోని పదకొండు బోధనాస్పత్రుల్లో సగటునగంటకు140మందివరకూఅత్యవసర చికిత్సకు వస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అత్యవసర చికిత్సకు చేర్చిన పేషెంటుకు వైద్యం అందించక మునుపే మరో పేషెంటు వస్తుండటంతో వైద్యులు బెంబేలెత్తుతున్నారు. హెల్త్ ఎమర్జెన్సీని తలపిస్తున్న ఈ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉంది. ఐసీయూ వార్డుల్లో పడకల సంఖ్య తక్కువగా ఉండడంతో బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు వెంటలేటర్ల కొరత కూడా తీవ్రంగా ఉంది. గుండెజబ్బుల బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతుండగా,కార్డియాలజీస్పెషలిస్టులకొరతబాధితులను కలవర పెడుతోంది. ఎమర్జెన్సీ కేసుల్లో ఎక్కువగా ప్రమాద కేసులే ఉంటున్నాయని వైద్యులు వెల్లడించారు. ఒక్క అనంతపురం జనరల్ ఆస్పత్రికి గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు 850 మందికి పైగా వచ్చారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో నాలుగు మాసాల్లో 130 మందికి పైనే నమోద య్యారు. మరోవైపు గుండె సంబంధిత వ్యాధులతో వస్తున్న వారు అధిక సంఖ్యలో ఉంటున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ప్రమాద బాధితుల నమోదులోతూర్పు గోదావరి జిల్లా మొదటి స్థానంలో ఉండగా, గుండె జబ్బుల బాధితుల నమోదులో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. పురుగుల మందు లేదా మరేదైనా విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఎమర్జెన్సీ వార్డులకు వస్తున్న వారి సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. క్షణాల్లో ప్రమాద స్థలానికి చేరుకుని బాధితుల ప్రాణాలను నిలిపే 108 అంబులెన్సులను ప్రస్తుతం ఆక్సిజన్ కొరత తీవ్రంగావేధిస్తోంది.దీంతోఅత్యవసర సమయాల్లో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టంకూడా చోటుచేసుకుంటోంది. రాష్ట్రంలో 108 అంబులెన్సులు 438 ఉండగా, అందులో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు(ఏఎల్ఎస్) వాహనాలు 120 మాత్రమే. మిగిలినవన్నీ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) వాహనాలే. వీటిల్లో డీఫ్రిబులేటర్, వెంటిలేటర్, ఆక్సిజన్ సిలిండర్ వంటి సదుపాయాలు ఉండవు.

# ముంచుకొస్తున్న వ్యాధులు

అనంతపురం, జూన్ 28, నైరుతి రుతుపవనాలతో వర్షాలు ప్రారంభమయ్యాయి. వేసవి కాలం వెళ్లి వానలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ తరుణంలో వ్యాధులు కూడా పొంచి ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు విజృంభించనున్నాయి. వైరల్ ఫీవర్స్‌తో పాటు మలేరియా, డెంగీ, స్వైన్ ఫ్లూ, ఫైలేరియా, గ్యాస్ట్రో ఎంటరైటిస్, టైఫాయిడ్ వంటి వాటికి గురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జ్వరాల బాధితులు పెరుగుతున్నారు. వీరితో పాటు శ్వాస కోశ సంబంధ వ్యాధులు, గొంతు సంబంధ వ్యాధుల బారిన జనం పడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 80 పిహెచ్‌సీలు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలోని వైద్య విభాగాల్లో ఇప్పటికే ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారంతో పాటు కరపత్రాల ద్వారా కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రచారం చేపడుతోంది. ముఖ్యంగా పారిశుద్ధ్యం పాటించడంలోనూ, పరిశుభ్రమైన, కాచి వడబోసిన తాగునీటిని తాగడం, ఎక్కడా నీటిని నిల్వ ఉంచకుండా చూడటం, ఇళ్లలో కూడా అపరిశుభ్రత లేకుండా చూసుకోవడం, తొట్లలో, రిఫ్రిజిరేటర్లు వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని వైద్యాధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ప్రజల్లో రోగాలు, వాటి వ్యాప్తి గురించి చైతన్యపరుస్తున్నామని, ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధులు నియంత్రణ సాధ్యమని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇళ్ల మధ్య చెత్తాచెదారాలు నిల్వ ఉంచడం, పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోక పోవడం, ఎరువు దిబ్బలు ఇళ్ల సమీపంలోనే వేసుకోవడం వంటి కారణాలతో దోమలు అధికంగా ఉత్పత్తయ్యే ప్రమాదని చెబుతున్నారు. జనం ముందస్తుజాగ్రత్తలు తీసుకుంటే రోగాల వ్యాప్తిని ముందస్తుగా అరికట్టవచ్చంటున్నారు.



అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, ఎ ఎన్ ఎంలు, పంచాయతీ సెక్రటరీల ద్వారా సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సిల్లోనూ వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. కాగా విశాఖపట్నం మన్యం ప్రాంతం, రంపచోడవరం ఏరియాలో ఆంత్రాక్స్ బారిన పడి వరుస మరణాలు సంభవించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులో వైద్యం చేశారు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి లక్షణాలు కనిపించాయంటే తక్షణం ఐసొలేషన్ వార్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. 5వేల జనాభా ఉన్న ఒక్కో హెల్త్ సబ్ సెంటర్‌కు రూ.10వేలు ఎఎన్ఎం ద్వారా నిధులు అందిస్తున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నిధుల్ని వారే వెచ్చించాల్సి ఉందన్నారు

# ఎన్టీఆర్ కు వైసీపీ రంగులు..

విజయవాడ, జూన్ 28, ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసి కోర్టులో చీవాట్లు తిన్నా వైసీపీకి బుద్ధి రాలేదు. తాజాగా గుడివాడ సమీపంలోని బొమ్మలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులు పూసి తమ అరచకానికి హద్దులే లేవని వైసీపీ మరోసారి రుజువు చేసుకుంది. కృష్ణా జిల్లా గుడివాడలో అధికార వైసీపీ కార్యకర్తల అరాచకానికి హద్దు లేకుండా పోతోంది. తాజాగా బొమ్మలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులు పూసారు. చంద్రబాబునాయుడు బొమ్మలూరుకు కిలోమీటర్ దూరంలో ఉన్న అంగులూరులో జరగనున్న మహానాడుకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం శ్రేణులు ఉత్సాహంగా మహానాడు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో బొమ్మలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు తమ పార్టీ రంగులు పూసి వికృతానందం పొందారు.ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులు పూయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బొమ్మలూరు చేరుకున్న తెలుగుదేశం నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులను తుడిచేసి పాలాభిషేకం చేశారు. అనంతరం మళ్లీ పసుపు రంగు వేశారు. తెలుగుదేశం మహానాడుకు ముందు ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకే వైసీపీ ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, పిన్నమనేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. కాగా ఈ సంఘటన జరిగిన కొద్ది సేపటికే వైసీపీ నేతలకు తెలుగుదేశం కార్యకర్తలపై దాడికి దిగారు. దీంతో బొమ్మలూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొడాలి నాని దిగజారుడు రాజకీయాలకు ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులు వేదయం మరో తాజా తార్కానమని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు విమర్శించారు.మహానాడు బ్యానర్లు కనిపించకుండా వైసీపీ నేతల ఫ్లెక్సీలు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నది చాలక ఇప్పుడు ఎన్టీఆర్ విగ్రహానికి వైసీపీ రంగులు వేదయం దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు. గుడివాడలో తెలుగుదేశం మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గుడివాడలో పసుపు పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా తెలుగుదేశం జండాలు, బ్యానర్లతో గుడివాడ మొత్తం పసుపు మయం అయిపోయినట్లుగా వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే అక్కసుతో వైసీపీ నేతలు తెలుగుదేశం బ్యానర్లకు అడ్డంగా వైసీపీ నేతల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.అది చాలదన్నట్లు ఏకంగా ఎన్టీఆర్ విగ్రహానికే వైసీపీ రంగులు పూశారు. దీంతో తెలుగుదేశం శ్రేణులు మండి పడుతున్నాయి. గుడివాడ మహానాడు కొడాలి నాని పతనానికి నాంది కానుందని చెబుతున్నారు. ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడలో జరిగే మహానాడును విజయవంతం చేసేందుకు తెలుగుదేశం కార్యకర్తలు కంకణం కట్టుకుని పని చేస్తున్నారు.

# అర్ధరాత్రి కుప్పకూలిన నాలుగు అంతస్థుల భవనం..

ముంబై, జూన్ 28, మహారాష్ట్ర రాజధాని ముంబై నాయక్‌నగర్‌లో నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఎనిమిది మందిని రెస్క్యూ చేసి కాపాడినట్లు అధికారులు తెలిపారు. భవనం కూలిన సమాచారం అందుకున్న అధికారులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని కాపాడారు. భవనం శిథిలాల కింద చిక్కుకున్న 8మందిని రక్షించారు. ఆ తర్వాత వారిని ఆసుపత్రికి తరలించామని.. ప్రస్తుతం చికిత్స అందుతుందని అధికారులు తెలిపారు. అయితే, శిథిలాల కింద 20 నుంచి 25 మంది చిక్కుకుపోయినట్లు సమాచారం. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో భవనం కుప్పకూలగా వెంటనే సహాయక చర్యలు చేపట్టినట్లు బీఎంసీ అధికారులు, ఎన్‌డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఆశిష్ కుమార్ పేర్కొన్నారు.

# దళితులపై జరుగుతున్న దాడులను ఖండించండి

### ముండ్లపాటి పిచ్చయ్య డిమాండ్

బద్వేలు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం మల్యాల గ్రామంలో తూర్పుకాపులు దళితులపై ఘోరంగా దాడి చేశారు వారిపై చర్యలు తీసుకోవాలని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తాలూకా కన్వీనర్ పిచ్చయ్య డిమాండ్ చేశాడు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సభ్య సమాజం తలదించుకునేలా మోడ్రన్ సమాజంలో కూడా ఇలాంటి ఇ వివక్ష కరమైన కుల వివక్ష ఉండటం సిగ్గుచేటని, మనిషిని మనిషిని గా గౌరవించలేని పనికిమాలిన వాళ్ళు మాత్రమే ఎస్సీల పై దాడి చేశారని,వారిని కఠినంగా శిక్షించాలని, ఆడ, మగ తేడా లేకుండా విచక్షణాహితంగా కత్తులు, కర్రలతో దాడి చేయడం హేయమైన చర్య అని వారు ఖండించారు ఇప్పటికైనా రాష్ట్రంలో దళితుల పై జరిగే దాడులను అరికట్టాలని బాధితులకు రక్షణ కల్పించాలని ఆయన అన్నాడు. రాష్ట్రంలో దళితులపై దుర్మార్గమైన కుల దురహంకార దారుణమైన దాడులు పెరిగిపోతున్నాయి అని దీన్ని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కత్తి బ్రహ్మయ్య దళిత సీనియర్ నాయకులు ఎద్దుల సుబ్బన్న అంబేద్కర్ ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షులు వెంకటరమణ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి మండల అధ్యక్షుడు ప్రసాద్ నరసయ్య పాల్గొన్నారు.

# రైతుల కోసం అద్దెకు యంత్రాలు

ఏలూరు, జూన్ 28, రైతుకు సాగు వ్యయం తగ్గించేందుకు ప్రభుత్వం అద్దెకు ఆధునిక యంత్రాలు అందించే కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిల్లో ఎనిమిది రకాల యంత్రాలను అందుబాటులో ఉంచింది. జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిని రైతులు వినియోగించుకుని అద్దె చెల్లించాల్సి ఉంటుంది. బయట మార్కెట్లో ధరలతో పోల్చుకుంటే అద్దె చాలా తక్కువగా ఉంటుంది. నారుపోసిన దగ్గర్నుంచి కోత కోసేవరకు ఎకరానికి మొత్తం వ్యయం రూ. 8 వేలు అయ్యేలా ఈ యంత్రాలకు ధరలు నిర్ణయించారు.జిల్లాలోని తాడేపల్లిగూడెం, చింతలపూడి, మార్టేరు, ఉండ్రాజవరంలలో ఈ అద్దెకిచ్చే కేంద్రాలను గతేడాది ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో రోటోవీటర్‌తో కలిపి ఉన్న రెండు ట్రాక్టర్లు, ఆరు వరసలు, నాలుగు వరసలు నాట్లు వేసే యంత్రం, ట్రేలు, వరికోత యంత్రం, కలుపుతీసే యంత్రం, నేల చదును చేసే యూనిట్, విత్తనాలు నాటే యంత్రం ఇలా రూ. కోటి విలువ చేసే వాటిని ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. రైతులు వినియోగించడమే తరువాయి. కోరమాండల్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యత ఆ సంస్థ మార్కెటింగు ఆఫీసర్లు చూస్తున్నారు. రైతులు వీరిని సంప్రదిస్తే యంత్రాలను అద్దెకు ఇస్తారు. గత రబీసీజనులో ఈ నాలుగు ప్రాంతాల్లో పలువురు రైతులు వీటిని వినియోగించుకున్నారు.సాగు వ్యయం భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉండే యంత్రాలను వినియోగించుకోవడం ద్వారా ఎకరంలో రూ. 8వేలు ఖర్చుతో సాగు సాగేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం కూలీల భారం బాగా పెరిగిపోయింది. సమయానికి కూలీలు దొరక్క కాడి వదిలేసే పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో యంత్రాల వినియోగం అవసరం ఉంది. దానికితోడు జిల్లాలో వరిసాగు చేసేది ఎక్కువగా కౌలు రైతులే. వీళ్లు యంత్రాలను కొనుగోలు చేసుకోలేరు కాబట్టి ప్రభుత్వం ఈ కేంద్రాలను ప్రవేశపెట్టింది. ఈ యంత్రాల అద్దెలు బయట మార్కెట్లో కంటే తక్కువగా ఉండేలా జిల్లా కలెక్టరు ధరలు నిర్ణయించారు. అన్ని యంత్రాలు వినియోగించుకున్నా ఎకరానికి రూ. 8 వేలు దాటకుండా ఉండాలనే ఉద్దేశంతో ధరలు నిర్ణయించారు

## నేడు జాతీయ గణాంక దినోత్సవం

పిసి మహాలనోబిస్ జయంతిని జాతీయ గణాంక దినోత్సవంగా జరుపుకుంటారు. 'భారతీయ గణాంకాల పితామహుడు' అని ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జూన్ 29, 1893 న పశ్చిమ బెంగాల్ లోని కలకత్తా (ఇప్పుడు కోల్‌కతా)లోజన్మించారు. అతను స్వతంత్ర భారతదేశం యొక్క మొదటి ప్రణాళికాసంఘంలో కీలక సభ్యుడు మరియు పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత. మొదటి జాతీయ గణాంక దినోత్సవం జూన్ 29, 2006 న పాటించబడింది. ప్రొఫెసర్‌ప్రశాంతచంద్రమహాలనోబిస్‌జయంతినిపురస్కరించుకుని గణాంకాలు,పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవం నిర్వహిస్తుంది. 29 జూన్ 2015న భారతదేశంలో సామాజిక అభివృద్ధి నేపథ్యంతో 9వ జాతీయ గణాంకాలదినోత్సవం నిర్వహించారు. మహాలనోబిస్ ఒక భారతీయ బెంగాలీ శాస్త్రవేత్త, అప్లైడ్ గణాంక శాస్త్రవేత్త. అతని గణాంక కొలత కోసం ఉత్తమ మహాలనోబిస్‌దూరం గుర్తించదగినది. బహుళ కోణాలలో కొలతల ఆధారంగా ఒక బిందువు మరియు పంపిణీ మధ్య దూరాన్ని కనుగొనడానికి సూత్రం ఉపయోగించబడుతుంది. ఇది క్లస్టర్ విశ్లేషణ మరియు వర్గీకరణ రంగంలో విస్తృతంగా ఉపయోగించబడుతుంది. సమగ్ర సామాజిక-ఆర్థిక గణాంకాలను అందించే లక్ష్యంతో, పిసి మహాలనోబిస్ 1950 లో జాతీయ నమూనా సర్వేను స్థాపించారు. దేశంలో గణాంక కార్యకలాపాలను సమన్వయం చేయడానికి కేంద్ర గణాంక సంస్థను కూడా ఏర్పాటు చేశారు. అతని ప్రధాన రచనలలో కొన్ని, పెద్ద ఎత్తున నమూనా సర్వేలను నిర్వహించడానికి పద్ధతుల పరిచయం.యాదృచ్ఛికనమూనాపద్ధతులను ఉపయోగించడం ద్వారా ఎకరాలు మరియు పంట దిగుబడిని లెక్కించిన ఘనత ఆయనది. పిసి మహాలనోబిస్ ఒక గణాంకపద్ధతిని రూపొందించారు,ఇదివివిధసమూహాలప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితిని పోల్చడానికి ఉపయోగపడు తుంది. పిసి మహాలనో బిస్‌వరదని యంత్రణ ప్రణాళికకు గణాంకాలను వర్తింపజేయడంలో ముందున్నారు.

## లాడ్జిలో అగ్ని ప్రమాదం

తిరుపతి ఒక లాడ్జిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వెంకట శ్రీ వైష్ణవి ఇన్ లాడ్జిలోని ఐదవ అంతస్తు లోఘటన జరిగింది. హోటల్ స్టోర్ రూం లో మంటలు ఎగసి పడ్డాయి. ఫైర్ సిబ్బంది అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. లాడ్జి లో ఉన్న యాత్రికులు లను వెంటనే ఖాళీ చేయించారు.

## ప్రగతిపథంలో విశాఖ సహకార బ్యాంక్

విశాఖపట్నం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 5వ తేదీన కార్యకలాపాలను ప్రారంభించి 106 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 107వ సంవత్సరంలో పయనిస్తుంది. ఈ సందర్భంగా కోపరేటివ్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీడియా సమావేశం నిర్వహించి బ్యాంక్ ప్రగతిని వివరించారు. సమావేశంలో కోపరేటివ్ బ్యాంక్ గౌరవ చైర్మన్ మానం ఆంజనేయులు, చైర్మన్ చలసాని రాఘవేంద్ర రావు, సీనియర్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కర్ రావు, డైరెక్టర్లు జోసెఫ్ స్టాలిన్, కాకి భవాని, జానకి రామచంద్ర రాజు, ఉప్పలపాటి పార్వతి దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 46 బ్రాంచీలు, మరియు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో నాలుగు బ్రాంచీలు కలిగి ఉండి, మొత్తం 50 బ్రాంచీల తో బహుళ రాష్ట్రాల సహకార అర్బన్ బ్యాంకుగా కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. గత నలభై సంవత్సరాలలో బ్యాంకు అనూహ్యమైన ప్రగతి సాధించింది అన్నారు. 1984-85 సంవత్సరంలో 2.91 కోట్ల కార్యకలాపాలతో ఉన్న బ్యాంకు 2021-22 నాటికి 6797.96 కోట్ల స్థాయికి చేరుకుందని తెలిపారు. అలాగే 1984-85 లో 3661 మంది సభ్యులతో తొమ్మిది లక్షల షేర్లు ధనం మాత్రమే కలిగిన బ్యాంకు 2021-22 సంవత్సరానికి 92,200 మంది సభ్యులు, 272 కోట్లు షేర్ విధానంతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద అర్బన్ సహకార బ్యాంకు గా స్థానం సంపాదించుకుంది అని పేర్కొన్నారు. సహకార సూత్రాలు, విలువలకు కట్టుబడి పని చేస్తూ, సమాజంలోని వివిధ వర్గాల అవసరాలకు తగినట్లుగా సేవలు అందిస్తూ ఆయా వర్గాల మన్ననలు అందుకోవడం జరుగుతుందన్నారు.

## గుడివాడ మహానాడు వాయిదా




అమరావతి బుధవారం గుడివాడలో జరగనున్న టీడీపీ మహానాడువాయిదా పడింది. ఎడతెరిపి లేని వర్షం, వాతావరణం అనుకూలనీగా లేనందున కార్యక్రమం వాయిదా వేయాలని అధినేత చంద్రబాబు సూచించారు. మంగళవారం నాడు గుడివాడ మహానాడు నిర్వహణపై అధినేత చంద్రబాబు తో ముఖ్యనేతలతో సమీక్ష జరిపారు. గుడివాడ మహానాడు నిర్వహించుకున్న తర్వాతే మరో కార్యక్రమం చేపడదామని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా గుడివాడ మహానాడు తదుపరి తేదీ ఖరారు చేయాలని నేతలకు అయన ఆదేశించారు

## ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని కాపాడిన పీవీ నర్సింహారావు

### ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్

విజయవాడ క్లిష్ట సమయాల్లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని కాపాడిన ఆధునిక భారతదేశ నిర్మాత పీవీ నరసింహా రావు అని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజ నాథ్ కొనియాడారు. ప్రధానమంత్రిగా వినూత్న విధానాలను అనుసరించి దేశ సంపదను గణనీయంగా పెంచిన దివంగత పీవీ నర్సింహారావు స్ఫూర్తిగా ముందుకు సాగాలన్నారు. మంగళవారం మాజీ ప్రధాని పీ.వీ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రధానిగా పీవీ ప్రవేశపెట్టిన సంస్కరణలతో దేశం ఆర్థికంగానే కాకుండా అణుశక్తి, విదేశాంగ విధానం, అంతర్గత భద్రత వంటి రంగాల్లో గుణాత్మక అభివృద్ధి సాధించిందని అన్నారు. సకల జనుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ఆయన కార్యాచరణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఆయన నాయకత్వ దార్శనికత దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని, పీవీ అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుదామని శైలజనాథ్ పిలుపునిచ్చారు.

# 51 వేల మందికి అమ్మఒడి...ఎగనామం




విజయవాడ, జూన్ 28, రాష్ట్రంలో అమ్మ ఒడి పథకానికి 51 వేల మందిని దూరం చేసేశారు. పైగా ఇందులో నా తప్పేమీ లేదు... మీ పిల్లల హాజరు 75శాతం లేదు.. అది మీ తప్పేనంటూ నెపం తల్లుల మీదకు నెట్టేశారు. ఒక విధంగా 51 వేల మంది అమ్మలను అమ్మఒడి పథకానికి దూరం చేయడం ద్వారా జగన్ తనకు చాతకాదని బహిరంగంగా ఒప్పుకున్న సందర్భమింది. రాష్ట్రంలో 51 వేల మంది అమ్మలకు అమ్మఒడి ఇవ్వడం లేదని జగన్ బహిరంగంగా అంగీకరించారు. అయితే వారు అమ్మ ఒడికి దూరం కావడానికి మాత్రం తను కారణం కాదని అంటున్నారు. విద్యార్థుల హాజరు శాతం 75 లేకపోవడం వల్లే ఆ తల్లులందరికీ అమ్మ ఒడి ఇవ్వలేదని సాకు చెబుతున్నారు.ఇది ఎంత వరకూ సమంజసమనే ప్రశ్న పలువురి నుంచి వస్తోంది. రాష్ట్రంలో ఈ సారి 51 వేల అమ్మలకు అమ్మ ఒడి ఎగ్గొట్టినట్టు ఏ మాత్రం సంకోచం లేకుండా జగన్ చెప్పడాన్ని పలువురు గర్హిస్తున్నారు. శ్రీకాకుళం పర్యటనలో భాగంగా సీఎం జగన్ స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో అమ్మ ఒడి పథకం మూడో విడత కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 శాతం హాజరు ఉండాలని అమ్మ ఒడి జీవోలోనే పొందుపర్చామని చెప్పారు. ఆ జీఓ ప్రకారం 51 వేల మంది తల్లుల పిల్లల హాజరు శాతం నిర్దేశించిన దాని కంటే తగ్గిందని, అందుకే వారికి అమ్మ ఒడి అందించలేదని చెప్పుకొచ్చారు. పైగా భవిష్యత్ లో మళ్లీ ఇలాంటి పరిస్థితి తెలెత్తకూడదంటే తల్లులు తమ పిల్లల్ని బడికి పంపాలంటూ సలహా పారేశారు. జగన్ చెప్పిన ప్రకారమే చూసుకుంటే.. అంత మంది విద్యార్థులకు హాజరు శాతం ఎందుకు తగ్గింది? వారంతా ఎందుకు పాఠశాలలకు హాజరు కాలేదు? అనే విషయాన్ని సమీక్షించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వానికి లేదా? అని రాజకీయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఒక పక్కన కరోనా వచ్చి విద్యా సంస్థలు సరిగా నడవలేదు. ఆన్ లైన్ తరగతుల పేరుతో ఎందరో విద్యార్థులు ఇళ్ల నుంచే క్లాసులకు హాజరయ్యారు. గత విద్యా సంవత్సరం పాఠశాలలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. బయటికి వెళ్తే ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని ఆందోళనకర పరిస్థితుల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గిన మాట వాస్తవమే కావచ్చు. దొరికిందే సందు అనే విధంగా ఎప్పుడు ఏ వంక దొరికితే.. హామీల లబ్ధిదారుల సంఖ్యను కుదించేద్దామా అన్న రీతిలో జగన్ సర్కార్ వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థుల హాజరు శాతం నెపంతో వేలాది మంది తల్లులను అమ్మ ఒడి పథకాకి జగన్ సర్కార్ దూరం చేసిందని పలువురు విమర్శిస్తున్నారు.పథకాలను ఎగ్గొట్టే దురాలోచన చేస్తూనే.. అమ్మ ఒడి పథకంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జగన్ ఆరోపించడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు. అమ్మ ఒడి పథకాన్ని విమర్శించే వారిలో ఒక్కరైనా.. పిల్లల్ని చదివించే తల్లులకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించడాన్ని తప్పుపడుతున్నారు. స్కూలుకు తమ పిల్లల్ని పంపించే తల్లులకు అమ్మ ఒడి అందిస్తామని హామీ ఇచ్చింది జగన్ అయితే.. విమర్శకులు డబ్బులు ఇచ్చారా? అని అనడమేమిటని అంటున్నారు. తన హామీలకు కోతలు పెట్టేందుకు, ఎగ్గొట్టేందుకు దారులు తానే వెదికిన జగన్ రెడ్డి ఇప్పుడు 'అంతా మీరే చేశారు'అన్న రీతిలో విద్యార్థులు, వారి తల్లులపైనే నెపం నెట్టేయడం దారుణం అంటున్నారు. అంత మంది తల్లులకు అమ్మ ఒడి ఎగ్గొట్టడమే కాకుండా.. 'తనకు ప్రజల అండ ఉన్నంత వరకు ఎవరూ తన వెంట్రుక కూడా పీకలేరం'టూ మరోసారి తన అక్కసును, అసహనాన్ని బహిరంగంగా వెళ్లగక్కడం విస్మయానికి గురిచేస్తోందంటున్నారు. ఇప్పుడు అమ్మ ఒడి పథకం డబ్బులు ఎగ్గొట్టడమే కాకుండా.. 'తల్లికి కూడు పెట్టనోడు.. పినతల్లికి గాజులు చేయించాడు' అన్న చందంగా పేద విద్యార్థుల కోసం బైజూస్ యాప్ తీసుకొచ్చామంటున్నారు. 4.7 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు ఇస్తారట. ఉన్నది పీకేసి లేనిది ఇవ్వడం అంటే ఇదేనేమో అంటున్నారు.

# చిత్తూరు టీడీపీ వర్సెస్ వైసీపీ




తిరుపతి, జూన్ 28, అది 2015 నవంబర్. చిత్తూరు మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త మోహన్‌లను మున్సిపల్ కార్యాయలంలోనే ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన అప్పట్లో పెద్ద సంచలనం. కటారి దంపతుల దగ్గరి బంధువైన చింటూనే కీలక సూత్రధారిగా అభియోగాలు నమోదు చేశారు పోలీసులు. కోర్టు విచారణలో ఉన్న కేసును ఈ నెల 30కి వాయిదా వేశారు. విచారణలో భాగంగా సాక్ష్యులకు సమన్లు వెళ్లాయి. ఇదే కేసులో వైసీపీ నేత బుల్లెట్ సురేష్ కూడా నిందితుడిగా ఉన్నారు. ఈ నెలాఖరున కోర్టులో ట్రయిల్ మొదలవుతుందనే కారణమో.. లేక పొలిటికల్‌గా పైచెయ్యి సాధించాలనే ఆత్రుతో ఏమో.. ఒక్కసారిగా చిత్తూరు రాజకీయం సెగలు కక్కుతోంది.ప్రధాన నిందితుడిగా ఉన్న చింటూ సాక్ష్యులను బెదిరిస్తున్నారనేది కఠారి దంపతుల కోడలు.. మాజీ మేయర్ హేమలత ఆరోపణ. ఇందులో కొందరు వైసీపీ నేతల పేర్లను ప్రస్తావించారామె. ఇంతలో కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న సతీష్‌ను గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడం.. అతను దొరక్కపోవడంతో.. కటారి కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉన్న పూర్ణను స్టేషన్‌కు తీసుకెళ్లడం రచ్చ రచ్చ అయింది. హేమలతతోపాటు టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో పరిస్థితి మారిపోయింది. ఈక్రమంలో పోలీస్ జీపు ధర్నా చేస్తున్న హేమలత కాలి పైనుంచి వెళ్లడంతో ఆమెకు గాయమైంది. గంజాయిని పోలీసులే తీసుకొచ్చి.. తప్పుడు కేసులు పెడుతున్నారనేది టీడీపీ నేతల ఆరోపణ.పోలీసుల తీరును నిరసిస్తూ.. టీడీపీ నేతలు అమర్నాథరెడ్డి తదితరులు ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. దాంతో ఈ ఆందోళనలో పాల్గొన్న అమర్నాథరెడ్డి, ఎమ్మెల్సీ దొరబాబుతోపాటు మిగతా వాళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిగా ఉన్న వైసీపీ నేత బుల్లెట్ సురేష్ ఒత్తిళ్ల మేరకే పోలీసులు సాక్ష్యులను బెదిరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వీటిని జిల్లా పోలీసులు కొట్టి పారేసినా.. కటారి దంపతుల హత్య కేసు కోర్టులో విచారణకు వస్తున్న సమయంలో మారుతున్న పరిణామాలు ఉద్రికత్తలకు దారితీస్తున్నాయి. రెండు వర్గాలు పట్టుబిగించడంతో సమస్య త్రుతిమించుతోంది. రాజకీయ రంగు పులుముకుంటోంది. మరి.. రానున్న రోజుల్లో ఈ హత్య కేసు విచారణ చుట్టూ రాజకీయం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## 40 కోట్ల విలువైన దేవాలయ ఆస్తిని అన్యాక్రాంతం చేయటానికి కుట్ర....

అమరావతి బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ తన కార్యాలయంలో మాట్లాడుతూగుంటూరు నగరంలో ఆరండల్ పేట 7/3 లో వేంచేసియున్న "శ్రీమోహన రంగనాయక స్వామి" దేవాలయంకు సంబంధించిన మొత్తం ఆస్తులను దేశరాజు బాలకృష్ణయ్య అనే దాత అప్పట్లో ఈ దేవాలయం నిర్మించి దేవాలయ అభివృద్ధి కోసం ఏడున్నర 7.50 ఎకరాలు భూమిని అందజేయడం జరిగిందని దానిలో అధిక భాగం ఆర్టీసీ వారు అప్పట్లో కొనుగోలు చేయగా మిగిలిన భూమి పాత గుంటూరు తమ్మారంగారెడ్డి నగర్లో ఒకటిన్నర 1.50 ఎకరం భూమి మిగిలి ఉంది. ఈ ఆస్తిని దేవాదాయ శాఖలో గతంలో పనిచేసిన ఈవో, అధికారులు కలిసి స్థానికులకు తప్పుడు పత్రాలతో అమ్మి వేస్తే దానిమీద గుంటూరు జిల్లా కోర్టులో మరియు ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టులో దావాలు నడిచి అప్పుడు జరిగిన 19 తప్పుడు రిజిస్ట్రేషన్ ల లావాదేవీలు అన్నింటిని కోర్టువారు కొట్టివేస్తూ, ఆ భూమిని సంబంధిత దేవాలయానికి తక్షణమే అప్ప చెప్పమని 12ఏళ్ల క్రితమే జిల్లా కోర్టు తీర్పు ఇచ్చారు. తీర్పు ఇచ్చి ఇప్పటికీ 12 సంవత్సరాలు గడిచిన కూడా దేవాలయానికి ఈ భూమిని అధికారులు అప్పచెప్పలేదని,స్థానికులతో దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఇంతవరకు ఎందుకు చర్యలు చేపట్టలేదని శ్రీధర్ ప్రశ్నించారు. మరలా ఇప్పుడు కొత్తగా స్థానిక ప్రజాప్రతినిధులు దేవాదాయ శాఖ అధికారులతో కుమ్మక్కై 40 కోట్ల విలువైన "మోహన రంగనాయక స్వామి" దేవాలయ ఆస్తిని గజం 10000 రూపాయలకు అక్రమంగా అమ్మేసి ప్రభుత్వం ద్వారా దేవాలయ భూమిని రెగ్యులరైజ్ చేయించి ఇప్పిస్తామని స్థానికులకు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థానికులు ఎవరూ వీరి మాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు కోర్టు తీర్పును అమలు చేయకుండా అధికారులు ప్రవర్తించడం చాలా దారుణమైన విషయమని, ఇది దేవుడి పట్ల చేసే పాపపు కార్యం అని, దేవాలయ ఆస్తులు, సత్రాలు ఇవేవీ ప్రభుత్వ భూములు కావని ఆనాడు దాతలు వారి సొంత ఆస్తుల్ని దేవాలయాల అభివృద్ధి కోసం త్యాగం చేశారని, ఇప్పుడున్న ప్రజాప్రతినిధులు దేవాలయ ఆస్తుల్ని కబ్జాచేసి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని, దేవాలయ ఆస్తుల పట్ల ప్రజా ప్రతినిధులు గాని, ప్రభుత్వాలు గాని పరిరక్షకులే తప్పితే వాటి యజమానులు ఎప్పటికీ కాలేరని, వాటిని అన్యాక్రాంతం చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తే న్యాయవ్యవస్థలు భగవంతుడు రూపంలో వీరందరికీ తగు శిక్ష విధిస్తాడని హెచ్చరించారు. ఇప్పటికైనా సరే దేవాదాయ శాఖ అధికారులు కోర్టు వారిచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేసి ఈ భూమిని దేవాలయానికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు వేస్తామని, అధికారులపై న్యాయపోరాటం చేస్తామని, హెచ్చరించారు. దేవాలయ భూముల్ని అన్యాక్రాంతం చేసే ప్రజా ప్రతినిధులకు వ్యతిరేకంగా స్థానిక భక్తులతో కలసి బ్రాహ్మణ చైతన్య వేదిక ఉద్యమం చేస్తోందని, వీరికి తగు రీతిలో బుద్ధి చెప్తామని శ్రీధర్ హెచ్చరించారు.

# రిటైరవుతున్నా రాని ఉద్యోగాలు

చెన్నై, జూన్ 28, అగ్నిపథ్‌పై విభిన్న ప్రచారాలు జరుగుతున్నా.. మాజీ సైనికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ప్రైవేట్ సెక్టార్‌లో కూడా ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవడం లేదు. దేశ వ్యాప్తంగా ఈ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ప్రస్తుతం అగ్నిపథ్‌ను బీజేపీ మినహా.. మిగతా పార్టీలన్నీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యతిరేకత, నిరసనలు ఎలా ఉన్నా.. దేశంలోని 33 రాష్ట్రాలు (యూటీ)లతో కలుపుకుని 5.69 లక్షల మంది ఆర్మీ మాజీ సైనికులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటే.. అందులో కేవలం 14,165 మందికి మాత్రమే ఎంప్లాయిమెంట్ లభించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మాజీ సైనికులకు ప్రత్యేక కోటా ఉన్నా.. దాన్ని నింపడం లేదు. ఆ కోటాలో ఉద్యోగాలను నియమించడం లేదని స్పష్టమవుతోంది.దేశవ్యాప్తంగా మాజీ సైనికులు 26.75 లక్షల మంది ఉన్నట్లు లెక్క తేలింది. ఆర్మీ అధికారులు ఇటీవల రాష్ట్రాల వారీగా తీసిన అధికారిక సమాచారం ప్రకారం మాజీ సైనికులు 23.15 లక్షల వరకు ఉంటే.. ఆర్మీలో వివిధ విభాగాల్లో పని చేసి, పదవీ విరమణ పొందినవారు మరో 3.60 లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు.ప్రస్తుతానికి రిటైరైన వారిలో 21 లక్షల మంది 33 నుంచి 37 ఏండ్లలోపు ఉన్నవారేనని తెలుస్తోంది. వీరిలో వివిధ రాష్ట్రాల్లో 5.69 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. ఆర్మీలో పదవీ విరమణ పొందిన తర్వాత ప్రస్తుతం వారికి సగటున రూ.18 వేల నుంచి రూ.30 వేలలోపు పెన్షన్? వస్తుందని ఆర్మీ మాజీలు చెప్తున్నారు. మేజర్, ఆపై స్థాయిలో ఉన్నవారికి మాత్రం రూ.30 నుంచి రూ.48 వేల వరకు పెన్షన్ రూపంలో జమ అవుతోంది. దీంతో చాలామంది మాజీ సైనికుల కోటాలో పని చేసేందుకు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఆర్మీ నుంచి వచ్చే పెన్షన్‌తో బతుకలేకపోతున్నామంటూ ఉద్యోగాల వేటలో పడ్డారు. కానీ, వారికి ఎంప్లాయ్?మెంట్ దూరంగానే ఉంది. ఇప్పుడు ఆర్మీ మాజీల కోటాలో ఉన్న దరఖాస్తులు దేశ వ్యాప్తంగా 5.69 లక్షలుగా ఉంటే.. తెలంగాణలో 5792 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగాలకు అన్ని రకాల అర్హతలున్న వారే. కానీ, రాష్ట్రంలో.. దేశంలో ఏండ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేకపోవడం, వచ్చిన వాటిలో అవకాశం రావడం లేదు. అంతేకాకుండా దేశంలో ఆర్మీలో పని చేసి రిటైరైన వారిలో 21 లక్షల మంది వరకు 35 ఏండ్లలోపు వారున్నారు. తెలంగాణలో దాదాపు 8 వేల మంది ఉన్నారు. కానీ, ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు రాకపోవడంతో.. ప్రైవేట్‌గా దొరికిన ఉద్యోగం చేస్తున్నారు. అత్యధికంగా సెక్యూరిటీ గార్డులుగా కొనసాగుతున్నట్లు అంచనా వేస్తున్నారు.కొన్నేండ్ల నుంచి రూపుదిద్దుకున్న అగ్నిపథ్?ఇప్పుడు ఆర్మీ అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో పలు రాష్ట్రాల్లో నిరసనలు చోటు చేసుకుంటున్నాయి. రైళ్లను తగులబెట్టారు. దీనిలో కుట్ర కుణాలు, రెచ్చగొట్టడం ఎలా ఉన్నా.. ఆర్మీ మాజీ ఉద్యోగుల ఉద్యోగావకాశాలను పరిశీలిస్తే అగ్నిపథ్‌పై ఆందోళనలకు బలం చేకూర్చుతున్నాయి. ఎందుకంటే కేవలం నాలుగేండ్ల సర్వీసు తర్వాత మాజీ సైనికులు అనే కోటా కోసం ఎదురుచూస్తారు. అంతేకాకుండా ఆర్మీ రిటైర్డ్ పెరుగుతారు. వేలల్లో ఉన్న సంఖ్య లక్షల్లోకి చేరుతోంది. దీంతో ఆర్మీ మాజీలుగా ఉండే లక్షల మంది ఉపాధి అవకాశాలు కష్టమవుతాయి. స్వయం ఉపాధి కూడా ఇబ్బందులే తెచ్చిపెట్టనుంది. రిటైర్మెంట్?బెనిఫిట్స్?కింద రూ.11 లక్షలు ఇస్తామన్నా.. వాటితో సంపూర్ణంగా వ్యాపారాలు చేయరు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించవు. అంతేకాకుండా బ్యాంకుల్లో రుణాలు కూడా ఇవ్వడం కష్టమే. ఇప్పటికే రిటైరవుతున్నవారికీ ఉపాధి లేదు. ఇలాంటి సమయంలో లక్షల మంది మాజీ సైనికులకు ఎంప్లాయిమెంట్ దొరకడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఘనంగా పీవీ జయంతి వేడుకలు

హుస్నాబాద్ హన్మకొండ జిల్లాను పివి జిల్లాగా నామకరణం చెయ్యాలి -పివి జయంతి వేడుకలలోప్రాముఖ సామాజిక వేత్త వలుస సుభాష్ చంద్రబోస్ నేత విజ్ఞప్తి కోహెడ మండల శాఖ గ్రంథాలయంలో భారత దేశ మాజీ ప్రధాని పివి నరసింహరావ్ 101వ జయంతి వేడుకలు పురస్కరించుకుని సామాజిక కార్యకర్త ,పీవీ నరసింహారావు జయంతి ఉత్సవ కమిటి చైర్మన్ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో పివి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పి వి చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ సామాజిక వేత్త వలస సుభాష్ చంద్రబోస్ నేత మాట్లాడుతూ.. పివికి భారత అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని, హన్మకొండ జిల్లాను పివి జిల్లాగా నామకరణం చెయ్యాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గతంలో మేము పివికి భారతరత్న ఇవ్వాలని ,పివి పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర , అనేక ఉద్యమాలు చెయ్యడం జరిగిందన్నారు. గత యేడాది నవంబర్ 28న, భారత్ భయోటెక్ సందర్శన కోసం వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ముందు ప్రదర్శన చేసిన రాజును ప్రత్యేకంగా అభినందించారు. పివి అఖిల భారత కాంగ్రెస్ కమిటి ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ ప్రధాని స్థితప్రజ్ఞ అపర చాణిక్యులు వివాద రహితుడు బహుభాషా కొవిధుడు ఆర్థిక సంస్కరణల పితామహుడు కరీంనగర్ జిల్లా (పాత) బీమదేవరపల్లి మండల్ వంగర గ్రామంలో జన్మించి మంథని నియోజకవర్గంనుండి నాలుగు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి అనేక శాఖల్లో మంత్రి పదవులు చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా, కేంద్రంలో అనేక మంత్రి పదవులను అలంకరించి వాటికి వన్నెతెచ్చి ప్రపంచ దేశాల కు భారతదేశ ఖ్యాతిని గొప్ప తనాన్ని చాటిచెప్పిన మహనీయులు పివి అని కొనియాడారు.గత ఏడాది శతజయంతి ఉత్సవాలను యేడాది పాటు ఘనంగా నిర్వహించి పివి పేరు మీద వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం కేసీఆర్, శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కె. కేశవరావు,రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీ కాంతారావు కి, రాష్ట్ర కమిటీ సభ్యులు హుస్నాబాద్ ఎమ్మెల్యే ఓడితేల సతీష్ కుమార్ లకు సుభాష్ చంద్రబోస్ ,రాజు లు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. పివి పుట్టి పెరిగిన లక్నెపెల్లి, వంగర గ్రామాలను మండలాలు గా ఏర్పాటు చేయాలని అన్నారు.జులై రెండు న బారత ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ పర్యటనలో భాగంగా పివికి బారత రత్న ప్రకటించాలని స్నేహిపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన మేధావులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్లనే తగిన గుర్తింపు గౌరవం లభించిందన్నారు. పివి స్వగ్రామమైన వంగర గ్రామంలో స్మృతి వనం పనులు త్వరగా పూర్తి చేయాలని ,సీఎం కేసీఆర్ కి ప్రత్యేకంగా విన్నవించుకున్నారు. ఈకార్యక్రమంలో కోహెడ మండల పరిషత్ అధ్యక్షులు కొక్కుల కీర్తి - సురేష్ నేత, కూరేళ్ల మాజీ సర్పంచ్ కేతిరి రెడ్డి బాలరెడ్డి,గ్రంథాలయ పాలకులు చిట్యాల బాలయ్య ,మంద దయాకర్,మాంకాళి అంజయ్య చింతల బాలనర్సు,కుర్రు మల్లయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేముల శ్రీనివాస్ నేత, పీవీ నరసింహారావు అభిమానులు పాల్గొన్నారు.



# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పై వేసే భారాలకు వ్యతిరేకంగా జరుగు ధర్నాలో పాల్గొనండి




## ప్రజలకు సిపిఎం జిల్లా కమిటీ పిలుపు

కర్నూలు జూన్ 28 ( విభారె) -: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అప్పటినుండి ప్రజలపై మోయలేని భారాన్ని వేశాయని, ప్రభుత్వాలు వేసే భారాలకు వ్యతిరేకంగా జూలై 4వ తేదీన కర్నూలు లో జరుగు ప్రదర్శన, ధర్నాలో జిల్లా ప్రజలు పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఈరోజు సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, రామాంజనేయులు, రాధాకృష్ణ, నారాయణ, నగర కార్యదర్శి రాజశేఖర్ రాముడులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశాన్ని ఉద్దేశించి గౌస్ దేశాయ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి జూలై 11వ తేదీ వరకు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు అదుపు చేయాలని, చెత్త పన్ను రద్దు చేయాలని, ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఇంటింటికి సిపిఎం జనం కోసం సిపిఎం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టిందనీ ఆయన తెలిపారు. అందులో భాగంగా సిపిఎం పార్టీ కర్నూలు జిల్లా కమిటీ జిల్లాలో 26 మండలాలు 265 గ్రామాల్లో, అలాగే నాలుగు పట్టణాలు 95 వార్డులలో సిపిఎం పార్టీ కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి సర్వే చేయడం జరిగిందని ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా 89163 కుటుంబాలను కలిశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు అనేక విషయాలు సిపిఎం పార్టీ బృందాలకు తెలియజేశారని స్థానికంగా ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు తమకు తెలిపారని అన్నారు అలాగే ధరల భారాలు భరించలేకపోతున్నామని ఆదాయాలు లేక వలసలు వెళుతున్నామని ప్రజలు మా కార్యకర్తలకు తెలియజేశారని ఆయన తెలిపారు. జిల్లాలో రైతుల పొలాలకు నీరందక రైతులు అనేక ఇబ్బందులకు పాలవుతున్నారని, జిల్లా వ్యాప్తంగా రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని ఆస్పరి ఆలూరు మధ్యలో రహదారుల గుంతలో పడి కొత్త దంపతులు మృతి చెందారని, ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి జిల్లాలో వచ్చిందని ఆయన తెలిపారు. జిల్లాలో అమ్మ ఒడి పథకం 40 వేల కుటుంబాలకు రాలేదని, పెన్షన్లు 25వేల మందివి రద్దు చేశారని, పంట బీమా పథకం 52,000 మంది రైతులకు రాలేదని, జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష 67 వేల రైతు కుటుంబాలకు భీమా పథకంలో పేర్లు నమోదు చేయలేదని అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఇలాంటి రైతుల కు తిరిగి బీమా పథకాన్ని వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తికొండ దేవనకొండ గ్రామాల్లో హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్లు వస్తే ఆ చెరువుల నుండి రైతు పొలాలకు పంట కాలువల తవ్వకపోవడంతో నీరందే పరిస్థితి లేదని ప్రభుత్వం తక్షణమే పంట కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పట్టణాల్లో మున్సిపల్ అధికారులు వేస్తున్న చెత్త పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెత్త పన్ను తక్షణమే రద్దు చేయాలని ఇంటి పన్ను విద్యుత్ చార్జీలు ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కర్నూలు నగరంలో రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం తక్షణమే చేపట్టాలని, క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని, జోహరాపురంలో డంప్ యార్డ్ స్థలంలో ఎన్టీఆర్ గార్డెన్ తరహాలో మెగా పార్కు నిర్మించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సమస్యల పైన ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లావ్యాప్తంగా జూన్ 30 తేదీన అన్ని మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహిస్తున్నామని, జూలై 4వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహిస్తున్నామని, ఆ రోజు సుందరయ్య జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే ర్యాలీలో ప్రజలు రైతులు కార్మికులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలుగు వారి ఠీవి మన పివి :- యం సుధాకర్ బాబు



కర్నూలు జూన్ 28 -: భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు తెలుగు వారి ఠీవి అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు యం సుధాకర్ బాబు ఆయన సేవలను కొనియాడారు. పివి నరసింహారావు 102వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన ఎందరో మహానుభావుల్లో మన పివి నరసింహా రావు ఎనలేని కీర్తి దక్కించుకున్నారని , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన హయాంలో భూసంస్కరణల చట్టం తీసుకొచ్చి వందలాది ఎకరాలు కలిగివున్న భూస్వాముల నుంచి భూములను ఒకే చట్టం ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేట్టు చేశారని , భూస్వాముల ఆగ్రహావేశాలను లెక్కచేయకుండా భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు చేసిన ధైర్యశాలి పివి నరసింహారావు యని భూస్వాముల కుటుంబానికి చెందిన పీవీ , తన పన్నెండు వందల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారని , పివీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెత్తందార్లు అడవులలోని వన్యమృగాలను చంపడంతో చలించిపోయి వాటి సంరక్షణకు వన్య వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చారని పివీ సేవలను జాతీయ స్థాయిలో ఉపయోగించు కోవాలని భావించిన ఇందిరా గాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారని అన్నారు. పివి , ఇందిరా గాంధీ కి అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారని , ఎమర్జెన్సీ తర్వాత దేశమంతటా కాంగ్రెస్ ఓడిపోయినా మన రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాడని , నాడు రాష్ట్రంలో 42 పార్లమెంటు స్థానాల్లో 41 స్థానాలు కాంగ్రెస్‌కు రావడం వెనుక పివి పాత్ర కీలకమని , ఇందిరా గాంధీ హయాంలో తన బహుముఖ ప్రతిభ సామర్థ్యాన్ని అంతర్జాతీయ దౌత్యానికి ఉపయోగించారని ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆరు మాసాల్లో నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన ఘనత మన పివి కి దక్కుతుందని భారత ప్రధానిగా ఉన్న కాలంలో దేశంలో ఎన్నో రాజకీయ ఆర్థిక సామాజిక మలుపులు చోటు చేసుకున్నాయని దివాలా తీసే స్థాయికి చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించి సంస్కరణలకు బీజం వేశారని అందుకే పీవీని దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పిలుస్తారని దేశాన్ని ఏలిన ఏకైక తెలుగు వాడిగా చరిత్రకెక్కిన పీవీ గొప్పతనం గురించి సుధాకర్ బాబు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నందలి పివి నరసింహారావు చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సమావేశంలో వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ డిసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ పీసీసీ అధికార ప్రతినిధి ఎ కరుణాకర్ బాబు ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న సేవాదళ్ జిల్లా చైర్మన్ సజ్జాద్ హుస్సేన్ బిసి సెల్ బి మద్దిలేటి ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటన్న కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గుప్తా అభినాయుడు బివి సుబ్రమణ్యం వడ్డె వెంకటస్వామి మహిళా కాంగ్రెస్ కె వెంకటలక్ష్మి మొదలుగు వారు పాల్గొన్నారు.

## జులై ఒకటిన విశాఖలో జగన్నాథ రథయాత్ర

విశాఖపట్నం పూరిలో జరిగే జగన్నాథ స్వామి రథయాత్ర మాదిరిగా విశాఖ నగరంలోని జులై ఒకటో తేదీన ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా రదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒకటో తేదీ సాయంత్రం 4 గంటలకు జైల్ రోడ్ నుండి రదయాత్ర ప్రారంభమై సిరిపురం,గురజాడ కళాక్షేత్రం వద్ద ముగుస్తుందన్నారు. 15 వ వార్షికోత్సవం సందర్భంగా రథ యాత్రలో పాల్గొనడానికి రష్యా, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలనుంచి భక్తులు వస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా బెంగాల్, ఒడిశా రాష్ట్రం నుంచి రథయాత్రలో భజన మండలి పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

## వంగవీటి మోహన రంగా పోస్టర్ విడుదల....

విశాఖ వంగవీటి మోహన రంగా 75వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాధా రంగా మిత్ర మండలి నిర్ణయించింది. ఇందులో భాగంగా జూలై 4వ తేదీన భారీ అన్న సంతర్పణ కార్యక్రమం విశాఖ నగరంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా విడుదల చేశారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా చిన్న వయసులోనే చనిపోయినప్పటికీ, ఒక ఎమ్మెల్యేగా తక్కువ సమయం ఉండి, ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించారు అని తెలియజేశారు.

# వైష్ణవ్ తేజ్ న్యూ టీజర్ రెడీ

ఉప్పెన సినిమాతో బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్న మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ ఆ తర్వాత కొండపొలం సినిమాతో మాత్రం ఊహించని విధంగా డిజాస్టర్ ను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇక ఎలాగైనా మూడో సినిమాతో మాత్రం మళ్ళీ బౌన్స్ బ్యాక్ కావాలి అని వైష్ణవ్ టెక్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాడు. ప్రస్తుతం అతని మూడవ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. రంగరంగ వైభవంగా అనే ఈ సినిమాకు సంబంధించిన




టీజర్ ను కూడా విడుదల చేయాలని చిత్ర యూనిట్ సభ్యులు సిద్ధమయ్యారు.ప్రముఖ నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ ప్రొడక్షన్ లో తెరకెక్కుతున్న రంగ రంగ వైభవంగా అనే సినిమాను త్వరలోనే విడుదల చేయబోతున్నారు. అర్జున్ రెడ్డి సినిమాను తమిళంలో రీమేక్ సిగేసిన గిరీషయ అనే దర్శకుడు ఈ సినిమాని డైరెక్ట్ చేసాడు. ఇక ఈ సినిమాకు సంబందించిన మొదటి టీజర్ ను ఈ నెల 27వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఒః సినిమాస్ లో ప్రత్యేకంగా ఉదయం 11 గంటలకు యూట్యూబ్ ద్వారా టీజర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.కొండపొలం డిజాస్టర్ అనంతరం వైష్ణవ్ తేజ్ ఈ సినిమాతో ఎలాగైనా సక్సెస్ ట్రాక్ లోకి రావాలని అనుకుంటున్నాడు. ఇక ఈ సినిమాలో రొమాంటిక్ గ్లామరస్ బ్యూటీ కేతికశర్మ మెయిన్ హీరోయిన్ గా నటించిన విషయం తెలిసిందే. డిఫరెంట్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు. ఇక ఈ సినిమా అనంతరం వైష్ణవ్ తేజ్ నాలుగవ సినిమాను కొత్త దర్శకుడు శ్రీకాంత్ రెడ్డి తో చేయబోతున్నాడు.త్రివిక్రమ్ అలాగే సీతారా ఎంటర్టైన్మెంట్స్ కలిసి నిర్మించబోతున్న ఆ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే వైష్ణవ్ తేజ్ లిస్టులో మరికొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఒక ప్రముఖ దర్శకుడు కూడా ఇటీవల వైష్ణవ్ తేజ్ కోసం ప్రత్యేకంగా ఒక కథను రెడీ చేసినట్లుగా తెలుస్తోంది. మరి ఈ సినిమాలతో ఈ మెగా మేనల్లుడు ఎలాంటి విజయాన్ని సొంతం చేసుకుంటాడో చూడాలి.

# బండ్లన్నకు దిమ్మదిరిగే పంచ్ పడిందా?

ప్రముఖ దర్శకుడు పూరిజగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'చోర్ బజార్'. 'దళం' జార్జిరెడ్డి చిత్రాల దర్శకుడు జీవన్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు నిర్మాత బండ్ల గణేష్ ..ఆకాష్ గురించి పూరి జగన్నాథ్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవి నెట్టింట వైరల్ అయ్యాయి. ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి కూడా. కన్న కొడుకు ప్రీ రిలీజ్ ఫంక్షన్ కి రాకుండా ముంబైలో ఏం చేస్తున్నావ్' అంటూ బండ్ల గణేష్ పై ఘాటు వ్యాఖ్యలు చేయడం ఇండస్ట్రీ వర్గాలు ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు కూడా.ఒక సామెత ఉంటుంది.. దేశం మొత్తం కళ్లాపి చల్లాడు కానీ.. ఇంటి ముందు కళ్లాపి చల్లడానికి టైం లేదని ఇప్పుడు పూరి జగన్నాథ్ ను చూస్తుంటే నాకు అదే అనిపిస్తోంది. ఎంతో మందిని ఆయన స్టార్స్ గా తయారు చేశాడు. డైలాగ్ లు రాని వాళ్లకి డైలాగులు నేర్పాటు.. డాన్స్ రాని వాళ్లకి డాన్స్ లు




నేర్పించాడు. కానీ కన్న కొడుకు సినిమా ఫంక్షన్ కి మాత్రం రాలేకపోయాడు. అదే నేనైతే లండన్ లో వున్నా స్పెషల్ ఫైట్ వేసుకుని మరీ వచ్చేవాడిని.ఎందుకంటే నేను న్నదే నా కొడుకు కోసం నా భార్య కోసం నా పిల్లల కోసం.. ఈ సారికి అయిపోయింది కానీ ఇంకోసారి ఇలాంటి పని మాత్రం చేయవద్దు. ఎందుకంటే మనం ఏం చేసినా పిల్ల కోసమే.. మనం చస్తే తలకొరివి పెట్టాల్సింది పిల్లలే. మనం సంపాదించే ఆస్తులు వాళ్లకే అప్పులు చేస్తే తీర్చేది వాళ్లే.. ఆకాష్ అంటే సన్నాఫ్ పూరి జగన్నాథ్.. నువ్వు ఎవరెవర్నో స్టార్లని చేశావ్.. నీ కొడుకు వచ్చేసరికి వెళ్లి ఎక్కడో ముంబైలో వున్నావ్' అంటూ బండ్ల గణేష్ .. పూరిపై ఓ రేంజ్ లో ఫైర్ అయ్యాడు. అయితే ఈ కామెంట్ లు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన పూరి మాత్రం డైరెక్ట్ గా ఎలాంటి కామెంట్ లు చేయలేదు. కానీ తాజాగా పూరి విడుదల చేసిన ఓ ఆడియో క్లిప్ తో బండ్ల గణేష్ కు పూరి ఇండైరెక్ట్ గా దిమ్మరిగిదే పంచ్ ఇచ్చిట్టుగా తెలుస్తోంది.గత కొన్ని నెలలుగా పూరి జగన్నాథ్.. పూరి మ్యూజింగ్స్ పేరుతో ఆడియో వాయిస్ లని విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆడియోని విడుదల చేశారు పూరి జగన్నాథ్. బండ్ల మాటలకు పూరి రిలీజ్ చేసిన ఆడియో క్లిప్ పక్కా కౌంటర్ లా వుందని ఇండస్ట్రీలో చర్చించుకుంటున్నారు. 'గుర్తు పెట్టుకోండి మన నాలుక కదులుతున్నంత సేపూ మనం ఏమీ నేర్చుకోలేం. అందుకే జీవితంలో ఎక్కువ టైమ్ లిజనర్స్ గా వుంటే మంచిదని.. నోటికి ఏది పడితే అది మాట్లాడొద్దని ఇండైరెక్ట్ గా బండ్ల గణేష్ కు గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. గుర్తు పెట్టుకోండి.. మన నాలుక కదులుతున్నంత సేపు మనం ఏమీ నేర్చుకోలేం. అందుకే జీవితంలో ఎక్కువ టైమ్ లిజనర్స్ గా ఉంటే మంచిది. మీ ఫ్యామిలీ మెంబర్స్ కావచ్చు.. క్లోజ్ ఫ్రెండ్స్ కావచ్చు.. ఆఫీస్ పీపుల్ కావచ్చు.. ఆఖరికి కట్టుకున్న మీ పెళ్లాం ముందు కూడా ఆచితూచి మాట్లాడండి.. చీప్ గా వాగొద్దు.. చీప్ గా బిహేవ్ చేయమవద్దు. మన వాగుడు మన కెరీర్ ను మన క్రెడిబిలిటీని డిసైడ్ చేస్తుంది. మీకు పుమతి శతకం గుర్తుండే వుంటుంది. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ' అని 'తప్పు మాట్లాడటం కంటే నాలుక కొరికేసుకోవడం చాలా మంచిది'. నీ జీవితం మరణం నీ నాలుక మీద ఆధారపడి ఉంటాయి' అంటూ పూరి జగన్నాథ్ బండ్లన్నకు దిమ్మదిరిగే పంచ్ ఇండైరెక్ట్ గా ఇచ్చేసినట్టుగా స్పష్టమవుతోందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.

# మరో దేశంలో మన రామరాజు కొమురం భీమ్



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ ఆర్ ఆర్ సినిమా ఖండాంతరాలు దాటి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేస్తోంది. తెలుగు లో రూపొందిన ఒక సినిమా పదుల దేశాల్లో ప్రస్తుతం అక్కడి ప్రేక్షకులకు నచ్చింది అంటే రాజమౌళి ఏ స్థాయిలో సినిమా ను తెరకెక్కించాడో అర్థం చేసుకోవచ్చు. హీరోలు ఇద్దరు కూడా దేశవ్యాప్తంగా మంచి పాపులారిటీని దక్కించుకున్నారు.థియేట్రికల్ రిలీజ్ అయ్యి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు దక్కించుకున్న ఆర్ ఆర్ ఆర్ సినిమా ఇప్పుడు ఓటీటీ ద్వారా దేశ విదేశాలను చుట్టేస్తుంది. ఇండియాలో ఆర్ ఆర్ ఆర్ సినిమా ను జీ 5 లో స్ట్రీమింగ్ చేస్తూ ఉంటే.. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ను నెట్ ఫ్లిక్స్ ద్వారా స్ట్రీమింగ్ చేస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికే పదుల దేశాల్లో ఆర్ ఆర్ ఆర్ సినిమా ను ఆయా దేశాల భాషల్లో సబ్ టైటిల్స్ వేసి స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఇప్పుడు సౌత్ కొరియాలో కూడా ఆర్ ఆర్ ఆర్ ను నెట్ ఫ్లిక్స్ ద్వారా స్ట్రీమింగ్ చేస్తున్నారు. అక్కడ ప్రేక్షకుల కోసం కొరియన్ సబ్ టైటిల్స్ వేసి మరీ రామరాజు మరియు కొమురం భీమ్ లను అక్కడకు తీసుకు వెళ్లినట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు తెలియజేశారు.రామ్ చరణ్ అల్లూరి సీతారామరాజుగా.. ఎన్టీఆర్ కొమురం భీమ్ గా నటించిన ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ కీలక పాత్రలో నటించిన విషయం తెల్సిందే. బాలీవుడ్ స్టార్ నటుడు అజయ్ దేవగన్ కూడా ఈ సినిమాలో నటించి మెప్పించాడు. కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమాలోని పాటలు మ్యూజికల్ హిట్ గా నిలిచిన విషయం తెల్సిందే. సినిమా లోని విజువల్స్ మరియు ఎమోషన్స్ అద్భుతంగా ఉన్నాయంటూ రివ్యూలు వచ్చాయి.

# టెస్టుల్లో చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్.. 61 ఏళ్ల రికార్డు బద్దలు..!



ఇంగ్లండ్ మహిళలతో జరుగుతోన్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మారిజాన్ కాప్ రికార్డుల మోత మోగించింది. ఈ మ్యా?చ్ తొలి ఇన్నింగ్స్‌లో కాప్ అద్భుతమైన సెంచరీ సాధించింది. కాగా కాప్‌కు తన టెస్టు కెరీర్‌లో ఇదే తొలి టెస్టు సెంచరీ కావడం గమనార్హం. ఇక 213 బంతుల్లో 150 పరుగులు చేసిన కాప్.. తమ జట్టు 284 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ సాధిండంలో కీలక పాత్ర పోషించింది.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 45 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన కాప్ జట్టును అదుకుంది. ఒక వైపు వికెట్లు పడుతున్నా కాప్ ఒంటిరి పోరాటం చేసింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 91.3 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. ఇక ఇంగ్లండ్ బౌలర్లలో కేట్ క్రాస్ నాలుగు వికెట్లు,బెల్ రెండు,ఇసాబెల్లె వాంగ్,సోఫీ ఎక్లెస్టోన్,డేవిడ్సన్ రిచర్డ్స్,నటాలీ స్కివర్ తలా వికెట్ సాధించారు.

# అలా అయితే రోహిత్ స్థానంలో ఇకపై అతడే టీ20 కెప్టెన్!

పనిభారం తగ్గించేందుకు రోహిత్ శర్మకు టీ20 కెప్టెన్సీ నుంచి విముక్తి కల్పిస్తున్నారా? అతడి స్థానంలో మరో ఆటగాడికి పగ్గాలు అప్పజెప్పుతున్నారా? అంటే కాదు అనే సమాధానాలే వినిపిస్తోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి విశ్వసనీయ వర్గాల నుంచి! అయితే, వరుస సిరీస్‌లు ఉన్నపుడు మాత్రం రోహిత్‌కు విశ్రాంతి కల్పించేందుకు అతడి స్థానంలో ఇకపై స్టార్ ఆల్‌రౌండర్‌కు బాధ్యతలు అప్పగించే యోచనలో ఉందట బీసీసీఐ!ఇంత?కీ ఎవరా ఆల్‌రౌండర్? ఐపీఎల్-2022తో తొలిసారిగా కెప్టెన్‌గా ప్రయాణం ప్రారంభించాడు హార్దిక్ పాండ్యా. తొలి సీజన్‌లోనే తన జట్టు గుజరాత్ టైటాన్స్‌ను చాంపియన్‌గా నిలిపి ప్రశంసలు అందుకున్నాడు. ఈ క్రమంలో ఐర్లాండ్ పర్యటనలో భాగంగా టీ20 సిరీస్‌కు సారథిగా ఎంపికయ్యాడు. తొలి మ్యాచ్‌లోనే 7 వికెట్ల తేడాతో జట్టును గెలిపించి మధుర జ్ఞాపకాలు మిగుల్చుకున్నాడు.మరోవైపు.. అదే సమయంలో రోహిత్ శర్మ కెప్టెన్సీలోని భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనలో ఉంది. ఇక టీ20 ప్రపంచకప్-2022 తర్వాత టీమిండియా పలు వరుస టీ20 సిరీస్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో బిజీ షెడ్యూల్ కారణంగా రోహిత్‌కు బ్రేక్ ఇస్తే అతడి స్థానంలో ఇకపై పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడట!ఈ మేరకు సెలక్షన్ కమిటీ సభ్యుడు ఒకరు ఇన్‌సైడ్ స్పోర్ట్‌తో మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ స్థానాన్ని ఇప్పటికిప్పుడు వేరే ఆటగాడితో భర్తీ చేసే అవకాశమే లేదు. అయితే, తనపై పని ఒత్తిడిని తగ్గించే మార్గాలు అన్వేషిస్తున్నాం. ఇందులో భాగంగానే హార్దిక్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొన్ని టూర్లకు కెప్టెన్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190